క్లుప్తంగా

పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి



మిల్క్ సెంటర్ ప్రారంభిస్తున్న నాయకులు

మాడ్గుల: పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి అన్నారు. మండల పరిధి కుబ్యతండాలో గురువారం విజయ డెయిరీ పాల సేకరణ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. వినియోగదారులకు స్వచ్ఛమైన పాలు అందించడమే లక్ష్యంగా కేంద్రం పని చేస్తుందన్నారు. డెయిరీ మండల చైర్మన్ సాయిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రదర్శన



ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు లిస్టును నోటీసు బోర్డులో ఉంచిన ఎంపీడీఓ

యాచారం: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి గురువారం ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామాల ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల వివరాలను ప్రదర్శించారు. మండలంలోని 24 గ్రామాల జాబితాను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాధా రాణి, మండల పంచాయతీ అధికారి శ్రీలతలు ప్రకటించగా.. ఆయా గ్రామాల వద్ద కార్యదర్శులు ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను ప్రజల సందర్శన కోసం ఉంచారు. ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 30 లోపు ఫిర్యాదు చేయాలని ఎంపీడీఓ సూచించారు. తుది జాబితాను సెప్టెంబర్ 2న ప్రకటిస్తామని పేర్కొన్నారు.

సీసీకెమెరాలతో నిఘా పటిష్టం

కడ్తాల్: సీసీ కెమెరాల ఏర్పాటుతో నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయవచ్చని సీఐ గంగాధర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో.. రావిచేడ్ గ్రామానికి చెందిన సంతోజ్ విక్రాంత్ చారి కెమెరాల ఏర్పాటుకు రూ.30 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. రోడ్డు ప్రమాదాల్లో వాహనాలను గుర్తించేందుకు, చోరీలు, నేరాల నివారణకు, నిందితులను గుర్తించి, బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతర దాతను సన్మానించారు. ఎస్ఐలు శివశంకర వరప్రసాద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అమరులకు నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

ఇబ్రహీంపట్నం: విద్యుత్ ఉద్యమంలో పోలీసు కాల్పుల్లో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలాస్వామిల చిత్రపటాలకు సీపీఎం పార్టీ నాయకులు గురువారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సామెల్ మాట్లాడుతూ.. విద్యుత్‌ను ప్రైవేటీకరణ చేయవద్దని, స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలపై ఆర్థిక భారం మోపొద్దని 2000లో చంద్రబాబు సర్కారుకు వ్యతిరేకంగా నిర్వహించిన పోరాటాలను గుర్తు చేశారు. నాటి పోరాట ఫలితమే నేడు ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వాలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. సీపీఎం నాయకులు బుగ్గరాములు, జగన్, ఎల్లేశ్, విగ్నేష్, లింగస్వామి, జంగయ్య, గిరిలు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి సీఐ చేయూత



విద్యార్థిని నందినితో సీఐ మహేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: నిరుపేద క్రీడాకారిణికి పోలీసు అధికారి అండగా నిలిచారు. శిక్షణకు వెళ్లేందుకు విద్యార్థినికి కావాల్సిన ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచారు. వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా పదర గ్రామానికి చెందిన బండి నందిని.. అమ్రాబాద్ సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో విద్యనభ్యసిస్తోంది. కబడ్డీలో అత్యంత ప్రతిభ చూపిన సదరు బాలిక.. అక్టోబర్‌లో బెహరన్‌లో నిర్వహించే యూత్ ఏసియన్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైయింది. ఈ నేపథ్యంలో హర్యాలోని సోనిపట్ స్పోర్ట్స్ అథారిటీ ఇండియా క్యాంప్‌లో శిక్షణకు వెళ్లాల్సి ఉంది. ఇందుకు ఆర్థిక స్తోమత ఇబ్బందిగా మారింది. దీనికి గుర్తించిన కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఇబ్రహీంపట్నం సీఐ మద్ది మహేందర్‌రెడ్డి.. విద్యార్థిని శిక్షణకు వెళ్లేందుకు విమాన టికెట్ ఇప్పించారు. ఖర్చుకు కొంత మొత్తాన్ని అందజేశారు.



కడ్తాల్: మైసిగండిలో గణనాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు



కడ్తాల్: మైసిగండిలో అన్నదానం



తుర్కయంజాల్: కమ్మగూడ లక్ష్మీనగర్‌లో..

వాడవాడలా కొలువైన గణపయ్య

ప్రతి ఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలి. తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని పలువురు వక్తలు అన్నారు. చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాడవాడలా కొలుదీరిన పార్వతీ పుత్రుడు విఘ్నేశ్వరుడికి బుధ, గురువారం భక్తజనం పూజలు చేశారు. ఉండ్రాళ్లు, చెరుకు గడలు, పిండి వంటలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. పలుచోట్ల అన్నదానం చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



మంచాల: జాపాల మల్లికార్జున స్వామి యూత్..



ఇబ్రహీంపట్నం: శ్రీరాంనగర్ కాలనీలో జేఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొలువైన వినాయకుడి సన్నిధిలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు



యాచారం: మొండిగౌరెల్లిలో.. ఏసీపీ రాజు తదితరులు



ఆమనగల్లు: పద్మశాలీసంఘం ఆధ్వర్యంలో..



ఆమనగల్లు: రామాంజనేయ ఉత్సవ సమితి..



మంచాల: శివాజీ యూత్ ఆధ్వర్యంలో..



తుర్కయంజాల్: బ్రాహ్మణపల్లి వేణుగోపాల స్వామి ఆలయంలో..



ఇబ్రహీంపట్నం: శ్రీరాంనగర్ కాలనీలో అన్నదానం



కడ్తాల్: చెన్నకేశవ స్వామి సన్నిధిలో..

హమాలీలను గుర్తించండి

కడ్తాల్: హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలో హమాలీ వర్కర్స్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జిల్లెల పెంటయ్య, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా రమేశ్, యాదయ్య, అంజయ్య, సహాయ కార్యదర్శిగా బాలరాజు, జంగయ్య, రమేశ్, కోశాధికారిగా మైసయ్య, ఆర్గనైజర్ కార్యదర్శుడిగా శేఖర్, కమిటీ సభ్యులుగా కృష్ణయ్య, మల్లేశ్, పెంటయ్య, శ్రీను, కృష్ణయ్య, యాదయ్యలను నియమించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. మార్కెట్, బజార్, రైస్ మిల్లులో పనిచేసే హమాలీలను ప్రభుత్వం గుర్తించి, లైసెన్స్, డ్రెస్సులు ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇంటింటికీ సీపీఎం నాయకులు

యాచారం: మండల పరిధి మంతన్‌గౌరెల్లి గ్రామంలో గురువారం సీపీఎం బృందం పర్యటించింది. గ్రామంలోని రెండో వార్డులో ఎంపీటీసీ మాజీ సభ్యుడు తావునాయక్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా సరిగా లేదని, డ్రైనేజీ కాల్వలు, సీసీరోడ్లు లేక ఇబ్బంది పడుతున్నామని పలువురు ఫిర్యాదు చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ ఎదుట వారు ధర్నా చేశారు. అధికారులు తక్షణమే స్పందించి, గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చందునాయక్, శ్రీరాములు, జంగయ్య, కుమార్, రవి, భాస్కర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీసాయి ఆప్టికల్స్ ఆవరణలో సికింద్రాబాద్ పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. శిబిరంలో వైద్యులు కొట్ర మల్లేశ్, శ్రావణిల నేతృత్వంలో 135 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఇందులో 45 మందిని ఆపరేషన్ల కోసం పుష్పగిరి ఆస్పత్రికి పంపించారు. ప్రతినెల మొదటివారంలో శిబిరాన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

నిలబడి.. నీరసించి

ఓ వైపు విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయి. వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులకు జలకళ, జలశయాలు పరవళ్లు తొక్కుతుండగా.. మరోవైపు యూరియా కోసం అన్నదాతలు అనేక అగచాట్లు పడుతున్నారు. సాగు పనులు విస్తృతం చేసుకోవాలన్న ఆతృతతో ఫర్టిలైజర్ దుకాణాలు, పీఏసీఎస్‌ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. నిలబడి.. నీరసించి, దక్కిన అరకొర యూరియాను తీసుకెళ్తున్నారు.

యూరియా కోసం అన్నదాతల అగచాట్లు

- ఎరువుల దుకాణం, పీఏసీఎస్ వద్ద క్యూ
- కొద్దిపాటి స్టాక్ కోసం ఎగబడిన రైతులు
- విజిలెన్స్ అధికారుల తనిఖీ



ఇబ్రహీంపట్నం: శేరిగూడలోని ఉప్పరిగూడ పీఏసీఎస్ వద్ద ఎరువుల కోసం క్యూ

ఇబ్రహీంపట్నం: యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. శేరిగూడ ఉప్పరిగూడ వ్యవసాయ సహకార సంఘం ఎరువుల గోదాం వద్ద గురువారం రైతులు యూరియా కోసం పడిగాపులు కాశారు. అక్కడికి 450 బస్తాల లోడ్ రావడంతో ఒక్కసారిగా రైతులు ఎగబడ్డారు. దీంతో తొలుత ఒకరికి ఆధార్ కార్డుపై 3 బస్తాల ఇవ్వగా.. తరువాత రెండు మాత్రమే ఇచ్చారు. కొద్దిసేపటికే స్టాక్ అయిపోయిందని అక్కడి సిబ్బంది పేర్కొనడంతో నిరాశతో రైతులు వెనుదిరిగారు. ఆధార్‌పై తీసుకెళ్లిన యూరియాను కొందరు బ్లాక్‌లో విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తూ.. ఆధార్ కార్డుతో పాటు రైతు పాస్ బుక్ తప్పని సరి చేయాలని సూచించారు. ఇదిలా ఉండగా.. పీఏసీఎస్‌లోని ఎరువుల కేంద్రాన్ని హైదరాబాద్ రూరల్ రీజనల్ విజిలెన్స్ అధికారులు సోదా చేశారు. రికార్డులు, స్టాక్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారితో పాటు ఆ సంఘం చైర్మన్ పాండురంగారెడ్డి, ఏడీఏ సుజాత, ఏఓ విద్యాధరిలు ఉన్నారు.

650 టన్నుల పంపిణీ

మండలంలో సుమారు 7,500 ఎకరాల పంట సాగు అవుతుందని, ఇందుకు 750 నుంచి 780 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని పట్నం మండల వ్యవసాయాధికారిణి విద్యాధరి తెలిపారు. ఇప్పటికే 650 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశామన్నారు. వర్షాల కారణంగా లోడ్ రాలేదని పేర్కొన్నారు. దండుమైలారం, ఎంపీ పటేల్‌గూడ పీఏసీఎస్‌లోకి యూరియా లోడ్ రాకపోవడంతో ఉప్పరిగూడ పీఏసీఎస్‌కు రైతులు వచ్చారని ఆమె వెల్లడించారు. రెండు రోజుల్లో అవసరమైన మేర యూరియా అందుబాటులోకి రానుందని, రైతులు ఆందోళన చెందొద్దని సూచించారు.

పోలీసు పహారాలో

కడ్తాల్: యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలో సుమారు 16 వేల ఎకరాలకు పైగా వివిధ రకాల పంటల సాగువుతోంది. ఆయా పంటలకు ఈ సీజన్‌లో జూన్ నుంచి అక్టోబర్ వరకు 960 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటి వరకు 610 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. ఇంకా 350 టన్నులు రావాల్సి ఉంది. కాగా.. మండల కేంద్రంలో గురువారం 40 టన్నుల యూరియాను సింగిల్‌విండో కార్యాలయంతో పాటు, ఆగ్రోరైతు సేవా కేంద్రాల్లో పంపిణీ చేయగా.. రైతులు బారులు తీరారు. మొదటగా టోకెన్లు అందజేసి, ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. రెండు సంచులే ఇవ్వడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అందని వారు నిరాశతో వెనుదిరిగారు. ఎలాంటి సమస్య తలెత్తకుండా సీఐ గంగాధర్, ఎస్ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్‌లు పర్యవేక్షించారు.

ముందు చూపులేని ప్రభుత్వం



మంచాల పీఏసీఎస్ వద్ద రైతులు

మంచాల: ఎరువుల కొరత రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రైవేట్ ఫర్టి లైజర్ దుకాణాల్లోనూ లభ్యం కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 14వేల 200 ఎకరాలు. అందులో 6 వేల 700 ఎకరాలు వరి, 3 వేలు పత్తి, 2 వేలు జొన్న, 2 వేలు ఉద్యాన పంటలు సాగువుతోంది. గతంలో వరికి 360 టన్నుల యూరియా అవసరం ఉండగా.. ప్రసుత్తం మొదటి దఫాలో మంచాల పీఏసీఎస్‌కు 247 టన్నులు(5,500 బస్తాలు) వచ్చాయి. గురువారం రెండో విడతగా 444 సంచులు రాగా.. అవి గంట వ్యవధిలోనే ఖాళీ అయ్యాయి. అందని వారు నిరాషతో వెనుదిరిగారు. ప్రస్తుత వర్షాలతో భూగర్భ జలాలు పెరగడంతో సాగు పెరిగింది. అందుకు అనుగుణంగా ఎరువుల అవసరం ఏర్పడింది. ప్రస్తుతం 28–0–28 రకం 300 బస్తాలు, 20– 20 రకం ఎరువులు 200 అందుబాటులో ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వానికి ముందు చూపు కొరవడిందని, ఇప్పటికైనా స్పందించి అవసరం మేరకు ఎరువును అందించాలని రైతులు డిమాండ్ చేస్తుండగా.. రైతులు ఇబ్బంది పడొద్దని, వర్షాల కారణంగా పూర్తి స్థాయిలో దిగుమతి కాలేదని, అవసరం మేరకు ఎరువులు సరఫరా చేస్తామని వ్యవసాయ అధికారి శ్రీలత స్పష్టం చేశారు.

330 మెట్రిక్ టన్నుల యూరియా దిగుమతి

యాచారం: మండలానికి ఇప్పటి వరకు 330 మెట్రిక్ టన్నుల(7335 బ్యాగుల) యూరియా వచ్చింది. మొత్తం పంటల విస్తీర్ణం 15 వేల ఎకరాలు కాగా, అత్యధికంగా పత్తి, వరి పంటల సాగవుతోంది. పత్తి, వరి పంట కలిపి 11 వేల ఎకరాలు ఉండగా, ఎకరాకు రెండు బస్తాల యూరియా అవసరం ఉంటుంది. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు మండలానికి 7,333 బస్తాలు రాగా, ఇంకా 5 వేల సంచులు వస్తే సరిపోతుందని, రెండు, మూడు రోజుల్లో వెయ్యి బస్తాలు వస్తుందని మండల వ్యవసాయాధికారి రవినాథ్ తెలిపారు. వర్షాలు కురుస్తున్న సందర్భంగా యూరియాకు డిమాండ్ పెరిగిందని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. అవసరం మేరకు అందజేస్తామని పేర్కొన్నారు.

ర్యాగింగ్‌తో జీవితాలు అంధకారం

- తోటివారిని ఇబ్బంది పెడితే చర్యలు
- ఏసీపీ కాశిరెడ్డి



ఏసీపీకి జ్ఞాపిక అందజేస్తున్న కళాశాల సిబ్బంది

అబ్దుల్లాపూర్‌మెట్: ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను అంధకారం చేసుకోవద్దని వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి అన్నారు. మండల పరిధి గుంతపల్లిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమంలో ఏసీపీ మాట్లాడారు. కళాశాల ఆవరణ, బయట ఎక్కడైనా తోటి విద్యార్థుల్లో అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒకరిని మరొకరు ఇబ్బందులకు గురిచేస్తే.. పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ర్యాగింగ్ చేస్తే విధించే శిక్షలతో పాటు నమోదు చేసే సెక్షన్ల గురించి విద్యార్థులకు వివరించారు. సీఐ అశోక్‌రెడ్డి, ఎస్ఐ భద్యానాయక్, కళాశాల డైరెక్టర్ జయప్రద, ప్రిన్సిపాళ్లు శేషతల్పసాయి, ఉమామహేశ్వరరావు, ఇన్‌చార్జి బోసుబాబు, ఏఓ పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలి

మంచాల: తాగునీటి సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి జంగయ్య డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఆస్మత్‌పూర్ గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి, ప్రజా సమస్యలపై ఆరా తీశారు. నీటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రజల అవసరం మేరకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని కోరారు.

సర్కారు బడులకు ఆదరణ

సర్కారు బడి అంటే చిన్నచూపు ఉండేది. కానీ ప్రభుత్వ ప్రత్యేక శ్రద్ధతో ప్రజల్లో ఆదరణ పెరిగింది. బడుల బలోపేతానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో విద్యార్థుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. అందుకు నాణ్యమైన విద్య, సౌకర్యాల కల్పన దోహదపడ్డాయి.

- ప్రైవేటులో ఫీజు భారం.. ప్రభుత్వం ఉచిత ఆకర్షణ
- నాణ్యమైన విద్య.. ఉన్నతమైన ప్రమాణాలు
- మొగ్గుచూపుతున్న తల్లిదండ్రులు
- పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య



ఎల్మినేడు పాఠశాలలో విద్యార్థుల యోగా సాధన

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రైవేటుకు దీటుగా సౌకర్యాల కల్పనతో పాటు, నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ప్రభుత్వ ప్రకటన, విద్యాధికారుల బడి బాటతో మసకబారిన సర్కారు బడులు.. చిన్నారులతో కళకళలాడుతున్నాయి. అమ్మ ఆదర్శ పాఠశాలలు, మనఊరు– మనబడి కార్యక్రమాల ద్వారా పాఠశాలలకు మరమ్మతులు చేసి, తగిన సౌకర్యాలు ఏర్పాటు చేసి, అందంగా తీర్చిదిద్దడంతో గ్రామీణ ప్రాంత ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. అంతే కాకుండా ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల భారం మోయలేక.. సర్కారు బడుల్లో ఉచిత సౌకర్యాలతో పాటు, నాణ్యమైన విద్యను అందుతుండటంతో చాలామంది తమ పిల్లలను వీటిల్లో చేర్పిస్తున్నారు.

14 ఉన్నత స్కూళ్లలో 2,860 మంది

మండలంలో 14 జెడ్పీహెచ్ఎస్, 26 ప్రైమరీ, 7 యూపీఎస్, మోడల్ స్కూల్, కేజీబీవీ, ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో సుమారు 6వేలకు పైగా చిన్నారులు ఒకటి నుంచి పదవ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారు. ముఖ్యంగా జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలకు ప్రాధాన్యత సంతరించుకుంది. మండలంలో 14 గ్రామ పంచాయతీలు, రెండు మున్సిపాలిటీలలో కలిపి 14 జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ ఉండేది. ఈ సారి అందుకు భిన్నంగా వారి సంఖ్య పెరిగింది. 2024– 25 ఏడాదికి గాను 2,389 మంది ఉండగా.. ప్రస్తుత విద్యా సంవత్సరానికి 2,860 మంది(471) పెరిగారు.

ఆకట్టుకుంటున్న ఉచితం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పిల్లలకు ప్రభుత్వం నాణ్యమైన విద్యతో పాటు.. అన్నీ ఉచితంగా అందజేస్తుండటం.. ప్రజలను ఆకట్టుకుంటోంది. పుస్తకాలు, దుస్తులతో పాటు డ్రాఫ్ అవుట్లను తగ్గించాలనే ఉద్దేశంతో రుచికరమైన మధ్యాహ్న భోజనం (సన్నబియ్యంతో) అందులో గుడ్డును వడ్డిస్తోంది. టెన్త్ స్టూడెంట్స్‌కు ఉదయం పూట అల్పాహారం పెడుతోంది. దాతల సహకారంతో టై, బెల్టు, షూ, స్కూల్ బ్యాగులు అందజేస్తోంది.

ప్రైవేటు దోపిడీ

ఏటేటా ఫీజులు పెంచుతూ ప్రైవేటు పాఠశాలలు దోపిడీకి పాల్పడుతున్నాయి. సాధారణ పాఠశాలల్లో సైతం ఎల్‌కేజీ విద్యార్థులకు రూ.20 వేల నుంచి లక్ష వరకు వసూలు చేస్తున్నారు. దీంతో సంపాదన మొత్తం.. పిల్లల ఫీజులకే చెల్లించాల్సి వస్తుందన్న భావనతో తల్లిదండ్రులు సర్కారు బడులవైపు మొగ్గు చూపుతున్నారు.

సమష్టిగా కృషి



అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన. ఉచితంగా పాఠ్య, రాత పుస్తకాలు, దుస్తులు. సౌకర్యాల కల్పన తదితర వాటితో సర్కారు బడుల్లో క్రమంగా విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. మండల పరిధిలో ఈ సారి ఏకంగా 471 మంది పెరిగారు. కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు కల్పించడంతో పాటు.. సమష్టి కృషితోనే ఇదంతా సాధ్యం అయింది.

– హీర్యానాయక్, ఎంఈఓ, ఇబ్రహీంపట్నం